


www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

సోమవారం | 20 | జూలై | 2026 | పేజీలు: 08


# పటిష్టంగా భవిష్యత్ కార్యాచరణ

## అడుగంటిన జలాలు

## ప్రత్యామ్నాయమే మేలు

## నేడు మంత్రుల బృందం రాక



**నల్గొండ, అక్షిత ప్రతినిధి :** ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై సోమవారం ఉదయాదిత్య భవన్లో నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, ఎస్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల బృందం సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంత్రులు, శాసనమండలి చైర్మన్ తో పాటు, ఉమ్మడి జిల్లా పార్లమెంట్ సభ్యులు ,శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి జిల్లా అధికారులు హాజరవుతున్న ఈ సమావేశానికి అవసరమైన ఏర్పాట్ల విషయమై ఆదివారం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయాదిత్యభవన్లో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాబావ ..మిగతా 2లో




**చలో అంకాపూర్‌తో వేడెక్కిన పోరు**

**"అంకాపూర్"కు కాంగ్రెస్ పిలుపు**

**యుద్ధానికైనా సిద్ధమే" అంటూ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రతి సవాల్....!**

# ఆర్మూర్‌లో రాజకీయ రగడ!

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో రాజకీయ వేడి రోజురోజుకు పెరుగుతోంది. ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రజా సమస్యల చుట్టూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరుకుంది. ఒకవైపు కాంగ్రెస్ ..మిగతా 2లో

# పారదర్శకం... ప్రశాంతంగా పరీక్ష

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, అక్షిత బ్యూరో :** జిల్లాలోని స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శాఖ యూనిట్లలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో అవుట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయుటకు నిర్వహించిన వ్రాత పరీక్షలు విజయవంతంగా జరిగాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ యూనిట్ -1 , 2 విభాగాల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను భర్తీ చేయుటకు గాను ఆదివారం జనగామ కలెక్టరేట్ లో పరీక్షను నిర్వహించారు. అదనపు కలెక్టర్ బెన్ షాలోం తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,2 విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్ట లలో అవుట్ సోర్సింగ్ ..మిగతా 2లో

# వర్షపు నీటిని ఒడిసిపట్టి

## ఉద్యమంలా ఇంకుడు గుంతలు

## రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, అక్షిత బ్యూరో :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఉద్యమంలా చేపట్టాలని, ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరి (మాండేటరీ) చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు.కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ఎల్‌నినో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలందరూ ఇంకుడు గుంతలు నిర్మించేలా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షపు ..మిగతా 2లో

## పటిష్టంగా భవిష్యత్ కార్యాచరణ

**మొదటి పేజీ తరువాయి...**

పరిస్థితులు,భూగర్భ జలాలు, తాగునీటి నిర్వహణ వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, ఇరిగేషన్, విద్యుత్తు, వైద్య ఆరోగ్య తదితర అంశాలపై ప్రస్తుత పరిస్థితులతో పాటు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అందువల్ల సంబంధిత శాఖల అధికారులందరూ వారి శాఖలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని, అంతే కాక గత సంవత్సర పరిస్థితులను బేరిజు వేస్తూ నివేదికతో పాటు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేయాలన్నారు. వీటితోపాటు ఎల్ నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేలా సూచనలు, సలహాలు ఆ నివేదికలో పొందుపరచాలని చెప్పారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వారిగా ఎల్ నినో ప్రభావిత పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికారులందరూ సోమవారం నిర్వహించే సమీక్ష సమావేశానికి అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు సమీక్షలో భాగంగా ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేలా జిల్లాస్థాయి కార్యచరణ ప్రణాళిక పై అధికారులకు దిశా, నిర్దేశం చేస్తారని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం

యదావిధిగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందని, జిల్లా రెవెన్యూ అధికారి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, తదితరులు మాట్లాడారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టి

**మొదటి పేజీ తరువాయి...**

నీటి ప్రతి చుక్కను భూమిలోకి పంపించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, దీనిని ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఉమ్మడి గొంతుకతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి కోరారు. ప్రకృతి విపత్తును సమిష్టిగా ఎదుర్కోవాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. ప్రకృతి విపత్తును ఎవరూ ఒంటరిగా ఎదుర్కోలేరని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసికట్టుగా కదిలితేనే ఎల్‌నినో సవాల్‌ను అధిగమించగలమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పారదర్శకం...ప్రశాంతంగా పరీక్ష



**మొదటి పేజీ తరువాయి...**

పద్ధతిపై భర్తీ చేయుటకు , ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అంతకుముందు పరీక్ష హాజరైన అభ్యర్థులకు, ఇన్విజిలేటర్లకు ప్రభుత్వ నిబంధనలు, విధివిధానలపై జిల్లా కలెక్టర్ దిశానిర్ధేశశీ చేశారు. అలాగే ఈ పరీక్షకు 2 గంటల సమయం కేటాయించామని అన్నారు.

అభ్యర్థులు ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదివి అర్థం చేసుకుని జాగ్రత్తగా వ్రాయాలన్నారు.స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శాఖ యూనిట్ -1, 2 లో వివిధ విభాగాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, చైన్‌మెన్ , స్వీపర్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులకు మొత్తం 615 మంది అభ్యర్థులు దరఖాస్తులు స్వీకరించగా, 446 మంది అభ్యర్థుల పరీక్షకు హాజరు అయ్యారని, మిగతా 169 మంది అభ్యర్థులు వ్రాత పరీక్షకు గైర్హాజర్ అయ్యారు.

ఈ వ్రాత పరీక్ష పక్రియను పూర్తిగా లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ పరీక్ష నిర్వహణలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కుమారస్వామి, జీసీడిఓ గౌషియాబేగం, విద్యాశాఖల సిబ్బంది పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

# ఆర్మూర్‌లో రాజకీయ రగడ!




**మొదటి పేజీ తరువాయి...**

పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు అంకాపూర్‌లోని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసం ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వగా, మరోవైపు ఎమ్మెల్యే కూడా అదే స్థాయిలో ప్రతి సవాల్ విసురుతూ రాజకీయ సమరానికి సిద్ధమని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

**"ప్రతి గ్రామం నుంచి లబ్ధిదారులు రావాలి" -- కాంగ్రెస్ పిలుపు**

కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రతి గ్రామం నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, ఇళ్లు మంజూరు కాకపోయిన అర్హులు, సీఎంఆర్/ఎల్‌ఓసీ లబ్ధిదారులు, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులు భారీ సంఖ్యలో అంకాపూర్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి "ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకపోయినా నా సొంత నిధులతో ప్రతి గ్రామానికి 10 నుంచి 15 ఇళ్లు నిర్మిస్తాను" అని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆ హామీల అమలును డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

**"గౌరవంతో వస్తే గౌరవం... యుద్ధానికి వస్తే యుద్ధమే" -- ఎమ్మెల్యే**

కాంగ్రెస్ పిలుపుపై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఘాటుగా స్పందించారు. రాజకీయంగా ఎలాంటి సవాలుకైనా సిద్ధమేనని, గౌరవంగా వస్తే గౌరవం ఇస్తానని, యుద్ధానికి వస్తే యుద్ధం చేయడానికి కూడా వెనుకాడనని స్పష్టం చేశారు. "అందరూ వస్తే అంకాపూర్ దేశీ చికెన్ తినిపించడానికి కూడా సిద్ధమే" అంటూ వ్యాఖ్యానించారు. అవసరమైతే కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కూడా ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమని తెలిపారు.

ఆర్మూర్‌లో శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలను సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిపై ప్రజల ముందే లెక్క చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

**రాజకీయ రగడతో అభివృద్ధి పక్కదారి?**

ఒకరు సవాల్ విసిరితే మరొకరు ప్రతి సవాల్ విసురుతున్న పరిస్థితుల్లో ఆర్మూర్ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. ప్రజా సమస్యలు, ఉపాధి, రహదారులు, సాగునీరు, విద్య, వైద్యం వంటి అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకే ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రత్యేక గుర్తింపు ఉన్న ఆర్మూర్**

రాష్ట్ర రాజకీయాల్లో ఆర్మూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. గతంలో బీఆర్ఎస్ తొలి అభ్యర్థుల జాబితాలోనే ఆర్మూర్ అభ్యర్థిని ప్రకటించడం, పసుపు బోర్డు ఉద్యమంతో నిజామాబాద్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం ఈ ప్రాంత రాజకీయ ప్రాధాన్యాన్ని చాటాయి.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్ రెడ్డి స్వల్ప మెజారిటీతో విజయం సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ కుమార్ రెడ్డి రెండో స్థానంలో, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్ రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. అప్పటి నుంచి మూడు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పోటీ మరింత ఉధృతమైంది.

**ప్రజల ఆకాంక్ష ఒక్కటే... అభివృద్ధే అజెండా కావాలి**

రాజకీయాలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, వాటి వల్ల అభివృద్ధి ఆగిపోకూడదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ఇంటి పన్నుల వసూళ్లలో గుర్తింపు పొందిన ఆర్మూర్, అభివృద్ధి పరంగా కూడా ఆదర్శంగా నిలవాలంటే అన్ని రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలకు బదులుగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీనియర్ నాయకులు, సామాజిక వేత్తలు సూచిస్తున్నారు.

సోమవారం జరిగే "చలో అంకాపూర్" కార్యక్రమం నేపథ్యంలో ఆర్మూర్ రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయా? లేక అభివృద్ధి అంశాలపై చర్చకు దారి తీస్తాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం**

**ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందాం...**

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని సమిష్టిగా ఎదుర్కొందామని, రైతులంతా ఏకమై ఒకే నిర్ణయంతో వరి మినహా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో గల మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ తివారి, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 40 శాతం మాత్రమే వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలల లో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని, ఇది ఒక ప్రకృతి విపత్తు లాంటిదని తెలిపారు. సాగునీరు, త్రాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ కారణంగా ఈసారి నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని, ఒకే నిర్ణయంతో ఈ సీజన్ లో వరి సాగు చేయవద్దని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, వరి సాగు కారణంగా నష్టం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. జూన్ మాసంలో రైతు భరోసా అందించడం జరిగిందని, రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న ఆదాయం వచ్చే పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు.

# ప్రతి పేదవాడికి అండగా ప్రజా ప్రభుత్వం

### అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్లుగా పాలన

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

### నిర్మాణ దశలను బట్టి బిల్లుల చెల్లింపు

### మణుగూరులో రూ.3.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం/ అక్షిత బ్యూరో:** ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, అభివృద్ధి,సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్క పేదవాడికీ నష్టం కలగకుండా, వారి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.ఆదివారం మణుగూరు మండలం గుట్ట మల్లారంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రూ. 2.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవల్ వంతెన పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. పేద ప్రజల కష్టాల్లో అండగా నిలిచి, వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం నాణ్యమైన సన్న బియ్యం తినాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీని విస్మరించిందని విమర్శించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు రూ.63 కోట్లను వడ్డీలేని రుణాలుగా అందజేశామని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించామని వివరించారు.గతంలో మూతపడిన ఆశ్రమ పాఠశాలల స్థానంలో ఇతర కార్యకలాపాలు చేపట్టారని విమర్శించిన మంత్రి.. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం పేద, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అధునాతన భవనాలు నిర్మిస్తూ విద్యా సౌకర్యాలను మెరుగుపరుస్తోందన్నారు.గత ప్రభుత్వం పేదవాడి ఆత్మగౌరవాన్ని పెంచే గృహ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మాత్రం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. ఎలాంటి లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నిధులు జమయ్యేలా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను మంత్రి తీవ్రంగా ఖండించారు. ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలకు రాష్ట్ర ప్రజలు ప్రతి ఎన్నికలో తగిన సమాధానం చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంతకాలం పేదల పక్షాన నిలిచే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీవో రాహుల్, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు పూనెం రమేష్, పూజ , అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్‌కు

# లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు

### శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, అధికారులు, గ్రామస్తులు



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** హైదరాబాద్ రవీంద్ర భారతి కళావేదిక లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థ వారు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ వారి అర్ ఎస్ కె ఫౌండేషన్ ద్వారా చేస్తున్నటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి 'లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ ' అవార్డు ముఖ్య అతిధి గా విచ్చేసిన ప్రముఖ సినీ నటులు పృథ్వి రాజ్ చేతుల మీదుగా బహుకరించడం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మీ లాంటి సామాజిక సేవా కార్యక్రమాలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి అవార్డు లు మాకు భవిష్యత్తు లో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి తొడ్పాటు అందిస్తాయని ఎల్లవేళలా మాకు వెన్నంటి ఉండి నడిపిస్తున్న గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు..ఈ కార్యక్రమం లో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డా, పట్నం కమలా మనోహర్ మరియు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్.



**గద్వాల అక్షిత న్యూస్:** (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు. సోమవారం జూలై 20.2026 న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రస్తుత ఎల్ – నినో పరిస్థితులపై చేపట్టాల్సిన ముందస్తు చర్యల పట్ల జిల్లా ఇన్చార్జ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించే సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రజావాణి ద్వారా తమ సమస్యల పరిష్కారానికి వచ్చే జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి కార్యాలయానికి వచ్చి అసౌకర్యానికి గురి కాకూడదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ తెలియజేశారు.

## అల్ఫోర్స్ హైస్కూల్ - సీబీఎస్ఈ విద్యార్థులు పదో తరగతి సెకండ్ బోర్డు ఎగ్జామ్స్‌లో అత్యుత్తమ ఫలితాలు, జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం కైవసం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థులు చక్కటి ప్రణాళికలతో విద్యను అభ్యసించాలని మరియు ఉపాధ్యాయులు బోధించినటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేసి పట్టు సాధించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడినటువంటి పరీక్షలకు హాజరై అగ్రగామిగా ఉండాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ విద్యార్థులు సెకండ్ బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యా సంస్థలు ప్రారంభం నాటి నుండి అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ఇతర విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తున్నాయని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి తెలియదని వారు తెలుపుతూ ప్రతి విద్యార్థి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను తప్పకుండా సాధన చేసి పట్టు సాధించి ఆదర్శంగా నిలవాలని వారు చెప్పారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే విషయాలలో పట్టు వచ్చే విధంగా ప్రోత్సాహం అందించాలని మరియు ఆదర్శంగా నిలవాలని వారు చెప్పారు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ వారికి వివిధ విషయాల మీద పట్టు సాధించే విధంగా ప్రణాళికను రూపొందిస్తూ చక్కగా అమలుపరుస్తూ విజయ పరంపరను స్థిరపరుస్తున్నామని వారు చెప్పారు

శనివారం ప్రకటించినటువంటి సీబీ ఎస్ ఈ సెకండ్ బోర్డ్ ఎగ్జామ్స్ ఫలితాల్లో పాఠశాల చెందినటువంటి కె.ఓం కార్తికేయ 500 మార్కులకు గాను 495 మార్కులు సాధించాడని మరియు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని, ఎం.శ్రీహిత 494 మార్కులు మరియు ఏ. స్వర విస్తృతి 492 మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 495 మార్కులు అత్యుత్తమైనదని మరియు పాఠశాల ఈ సంవత్సరం కూడా అగ్రస్థానంలో నిలవడం చాలా గొప్ప విషయం అని వారు చెప్పారు అద్భుతమైన ఫలితాలు సాధింపచేస్తున్న బోధనా సిబ్బందిని, బోధనేతర సిబ్బందిని హృదయపూర్వకంగా అభినందిస్తూ సహకారం అందిస్తున్నటు వంటి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అత్యుత్తమ స్కోరులకు పుష్పగుచాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు మరియు భవిష్యత్తులో మరిన్ని అపూర్వ విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, బోధనా, బోధ నేతర సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు


## అసంపూర్తిగా ఉన్న 3 ఇండ్ల నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ అన్న సిమెంట్ అందచేత



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి నియోజకవర్గం,కల్వకుర్తి మండలంలోని గుండూరు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్న సహకారంతో మూడు ఇండ్లు సంపంగి శివ ,ఆఫీసు శ్రీను ,గోరేటి చిన్న చెన్నయ్య లకు సిమెంటును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు,బిఆర్ఎస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ నాగయ్య,మాజీ ఉప సర్పంచ్ లక్ష్మయ్య, వార్డ్ మెంబర్ రాజేందర్,నాగేంద్రం తుప్పల,సత్యనారాయణ, పోతనపల్లి కృష్ణయ్య మెంట బీరప్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఎన్యూమరేషన్ ఫామ్‌లు బిఎల్ఓలకు అందించాలి

**జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ**



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ నియోజక వర్గంలోని కల్వరాల గ్రామంలో నేడు ఎస్ ఐ ఆర్ పై ప్రజలకు అవగాహన కల్పించి ఎన్యుమరేషన్ ఫామ్ లు ప్రతి ఒక్కరు బి ఎల్ ఓ లకు అందించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ కోరారు. జులై 24 వ తేదీ వరకు మీ పూర్తి వివరాలతో బి ఎల్ ఓ లకు ఎన్యూమరేషన్ ఫామ్ లు అందించకపోతే ప్రజలు ఓటు హక్కును కొల్పేయే ప్రమాదం ఉందని, ఇంకా గ్రామంలో 700 లకు పైగా ఎన్యూమరేషన్ ఫామ్‌లు బి ఎల్ ఓ లకు చేరలేదని, ఇంకా ఎన్యూమరేషన్ ఫామ్ లు అందించని ప్రజలు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించ కుండా ఫామ్ లు బి ఎల్ ఓ లకు అందించాలని వారు ప్రజలకు తెలియజేసారు.

## రాజకీయాలకు అతీతంగా ఎల్‌నినో సవాల్‌ను ఎదుర్కొందాం

**ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఎల్‌నినో ప్రభావం రాష్ట్రం ముందున్న పెద్ద సవాల్ అని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎల్‌నినో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తొలిసారిగా ముందస్తు ప్రణాళికతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందన్నారు. జిల్లాల కలెక్టర్లు స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌తో క్షేత్రస్థాయిలో పనిచేసి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.రైతులను ఆదుకోవాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి రైతులు, ప్రజలను ఆదుకునే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. రాబోయే రోజుల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ధైర్యం కల్పించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రపంచ దేశాలతోపాటు అనేక రాష్ట్రాలు కూడా ఇదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్న శ్రీధర్ బాబు, వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతులు, ప్రజలకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సంక్షోభ నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తూ, ప్రజలకు ఉపశమనం కలిగించే ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

# కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే జేఏసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాడికొండ నుంచి కాజీపేట రైల్వే జంక్షన్ స్టేషన్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో వరంగల్ ప్రాంత యువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాల కల సాకారం కావాలని అన్నారు. ఫ్యాక్టరీలో కల్పించే ఉద్యోగాల్లో స్థానికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.



ఈ విషయంలో రైల్వే జేఏసీ తీసుకునే నిర్ణయాలకు అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని, జేఏసీ నాయకత్వంలో ఉద్యమం ఐక్యంగా కొనసాగాలని పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, కోచ్ ఫ్యాక్టరీ కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, అలాగే ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు కూడా తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రాంత అభివృద్ధికి, యువత భవిష్యత్తుకు మైలురాయిగా నిలవాలంటే స్థానికులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత బిడ్డలంటే ఇంత అలుసా..! ముఖ్యమంత్రి గారు



**భద్రాచలం అక్షిత న్యూస్:** దళిత బిడ్డలంటే ఇంత అలుసా!ముఖ్యమంత్రి గారు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు..భద్రాచలం పట్టణం లోని ఎస్సీ బాయ్స్ హాస్టల్లో ఉన్న ధర్మకోల్ షీట్ పరుపుల పై ఒక రాత్రి మీరు నిద్రించండి హాస్టల్ విద్యార్థుల బాధ ఏంటో తెలుస్తోంది, అని అన్నారు.. ఆదివారం సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ బాయ్స్ హై స్కూల్ అండ్ కాలేజీ హాస్టల్ నందు సమస్యలపై సిపిఎం బృందం సర్వే నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా శిథిలావస్థలో ఉన్న బిల్డింగును,పరిశీలించడం జరిగింది. విద్యార్థులు తమ సమస్యలను సిపిఎం బృందం కు తెలియజేశారు. పడుకోడానికి బంకర్ బెడ్స్ లేవని ధర్మకోల్ షీట్ పరుపులు ఇచ్చారని అవి పూర్తిగా ధ్వంసమైన వాటిపైనే నిద్రించవలసిన దుస్థితిలో మేము ఉన్నామని విద్యార్థులు వాపోయారు. ప్రస్తుతం స్కూల్ విద్యార్థులు 75 మందితో పాటు కాలేజీ విద్యార్థులు 30 మంది ఉన్నారని ఈ విద్యా సంవత్సరంలో ఇంకా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ హాస్టల్ బిల్డింగ్ సరిపోవటం లేదని బిల్డింగ్ పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని ఎప్పుడు కూలిపోతుందో అనే భయంతో ఉన్నామని విద్యార్థులు సిపిఎం బృందానికి తెలిపారు...

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ బాయ్స్ హాస్టల్ లోని విద్యార్థులు పాడైపోయి, చినిగిపోయిన ధర్మకోల్ షీట్ పరుపులు పై పడుకుంటున్నారని తక్షణమే ప్రభుత్వం బంకర్ బెడ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్య శాఖను తన వద్ద అట్టి పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక నిధులు కేటాయించి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ బిల్డింగు పై పెచ్చులు ఊడి కింద పడుతున్న హాస్టల్ బిల్డింగును తక్షణమే నూతన బిల్డింగ్ మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కరెంటు పోతే ఇన్వర్టర్ లేదని ,వాచ్మెన్ లేరని, యూనిఫామ్ ఇంకా రాలేదని వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు నకిరికంటి నాగరాజు, కొలగాని రమేష్, కోరాద శ్రీనివాస్, సంద్ర భూపేంద్ర, ఎస్ అజయ్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## జోష్ నింపిన అల్ఫోర్స్ ఎక్సెల్ క్యాంపస్ "నయా దౌర్" సాంస్కృతిక వేడుకలు





**కరీంనగర్ అక్షిత బ్యూరో:** విద్యార్థుల లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని మరియు సమాజంలో ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో అల్ఫోర్స్ ఎక్సెల్ (బాలుర రెసిడెన్షియల్ కళాశాల) క్యాంపస్ "నయా దౌర్" పేరుతో నిర్వహించినటువంటి ఫ్రెషెస్ పార్టీ వేడుకలను అట్టహాసంగా విద్యార్థుల కేరింతల మధ్య ప్రారంభించారు

ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజను ఆచరించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభను చాటి అవకాశాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. నేడు మన భారత దేశంలో ఎంతోమంది విద్యార్థులు వారి యొక్క అసమాన ప్రతిభతో అమూల్యమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని పటిష్టమైన స్థానాలలో స్థిరపడుతున్నారని గుర్తు చేస్తూ అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో సైతం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన విద్యానందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు. ఆరంభం నాటి నుండి విద్యార్థులకు ప్రతిభ ఆధారిత విద్యను అందిస్తూ అగ్రగామిగా ఉంటున్నామని వారు చెప్పారు. 2025- 2026 విద్యా సంవత్సరంలో వివిధ పరీక్షల ఫలితాల్లో అల్ఫోర్స్ అగ్రస్థానంలో నిలిచినదని హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు కష్టపడి తరగతి గదిలో నేర్చుకున్నటువంటి విషయాలను సమీక్షించుకొని వివిధ స్థాయిలలో నిర్వహిస్తున్నటువంటి పరీక్షల్లో ప్రతిభను చాటి అగ్రగామిగా ఉండాలని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి. అదే విధంగా 2025-26 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేశారు. అదేవిధంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక నృత్యాలు అలరింపచేసాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షిత
AKSHITHA NATIONAL DAILY
www.aakshitha.com



# సమష్టిగా నిలబడదాం

### మిషన్ మోడ్‌లో ఎల్‌నినోను ఎదుర్కొందాం

### కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా సమీక్షలో జిల్లా ఇన్చార్జి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వ యంత్రాంగం మొత్తం మిషన్ మోడ్‌లో పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వార్డు సభ్యుడి నుంచి ఎంపీ వరకు, పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎల్‌నినో ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణారావు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్ సింగ్, సంజయ్ కుమార్, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్, మేయర్లు, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



మహేష్ దత్ ఎక్కా, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా జిల్లాల్లో ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరుతడి పంటల ప్రోత్సాహం, విద్యుత్ సరఫరా, రైతులకు అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కార్యాచరణ ప్రణాళిక తీసుకుంటున్న చర్యలను సమావేశంలో వివరించారు. జిల్లాల కలెక్టర్లు సిపి ఎస్పీలు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు ఇరిగేషన్ భూగర్భ జలాలు, విద్యుత్, జిల్లా స్థాయి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలపై కూడా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో వర్షపాతం ఆశించిన స్థాయిలో నమోదుకాకపోవచ్చని, అందువల్ల ముందస్తు చర్యలే ప్రజలను రక్షిస్తాయని పేర్కొన్నారు. గ్రామ గ్రామాన రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్‌పామ్‌తో పాటు కందులు, నువ్వులు, వేరుశనగ, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటల సాగును నేల స్వభావానికి అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతుకు భూగర్భ జలాల పరిస్థితి, సాగునీటి లభ్యత, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామసభలు, రైతు వేదికలు, రైతు నేస్తం కార్యక్రమాల ద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, నీటి వినియోగంలో పొదుపు పాటించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. వ్యవసాయ, ఇరిగేషన్, భూగర్భ జలాలు, విద్యుత్ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు సమాచారం అందించాలని చెప్పారు. రాష్ట్రంలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని, భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ వ్యవస్థలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లను రైతు భరోసా కింద విడుదల చేసిందని గుర్తు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు. "రైతులు, ప్రజలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందరం సమిష్టిగా నిలబడి, మిషన్ మోడ్‌లో పనిచేసి ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమిద్దాం" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## కరోనా పరిస్థితుల స్ఫూర్తితో ఎల్‌నినోను అధిగమిద్దాం

### ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరోనా మహమ్మారి సమయంలో అందరూ సమిష్టిగా పనిచేసి సంక్షోభాన్ని అధిగమించినట్లే, ఇప్పుడు ఎల్‌నినో కారణంగా ఏర్పడుతున్న విపత్కర పరిస్థితులను కూడా సమన్వయంతో ఎదుర్కోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా ఎల్‌నినో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులు, ప్రజలను కాపాడడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని



అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ అప్రమత్తంగా పనిచేయాలని, ప్రజల్లో ధైర్యం నింపాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం రైతులు, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఏ విపత్తునైనా అధిగమించగలం. రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వం ప్రతి అడుగులోనూ రైతులకు అండగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

## సోమిడిలో వ్యవసాయ మోటర్లు, వైర్ల చోరీ పునరావృతం





**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సోమిడి గ్రామంలో శనివారం రాత్రి పలువురి రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన మోటర్లు, విద్యుత్ వైర్లు తదితర ఉపకరణాలు గుర్తు తెలియని దుండగులు చోరీ చెయ్యడం జరిగింది.

సమాచారం తెలుసుకున్న పాక్స్ డైరెక్టర్ కాయిత రాజ్ కుమార్ యాదవ్ , 62 బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రవణ్ యాదవ్ బాధిత రైతుల వ్యవసాయ బావులను పరిశీలించి చోరీ జరిగిన తీరును నష్ట తీవ్రతను రైతుల నుండి తెలుసుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమిడి లో గత 6నెలల కాలంలో మూడు పర్యాయాలు దొంగతనాలు జరిగాయని, పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసినప్పటికీ దుండగులను పట్టుకోవడంలో వారు శ్రద్ధ వహించడం లేదని వాపోయారు.

తీవ్ర వర్షాభావం తో రైతులు ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వరుస దొంగతనాలతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, పోలీసులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి దొంగలను పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేసి బాధిత రైతులకు న్యాయం చెయ్యాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు కాయిత బాలరాజు, జంగం రాజు, జక్కుల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మెగా జాబ్ మేళా

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తోందని, యువతకు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉద్యోగ అవకాశాలు అందించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యోగాల కోసం వచ్చిన యువతను ఉద్దేశించి మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నామని తెలిపారు. అర్హత, ప్రతిభ కలిగిన ప్రతి యువకుడు ఇలాంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యా సంస్థల బలోపేతం, యువతకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. యువత ఉద్యోగాలు పొందడమే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఆయన అన్నారు.

## 91 వ విశ్వశాంతి మహా యాగ మహోత్సవంలో పాల్గొన్న కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్ లో నిర్వహించిన శ్రీ కృష్ణ కాలచక్రం విష్ణుపంచాయతనం అయుత చండీ అతిరుద్రం శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం,చతుర్వేద పూర్వక మహాగణపతి మహాసార, సుదర్శన, లక్ష్మీ నారాయణ సహిత శ్రీమద్భాగవత 91 వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవములో భాగంగా శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ వారు నిర్వహించిన యాగంలో భాగంగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు. స్వామిజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇంత చక్కటి కార్యక్రమం కల్వకుర్తి లో ఏర్పాటు చేయడం చాలా మంచి పరిణామ మని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్,కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,నాయకులు సురేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్మల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్,మండల అధ్యక్షులు బాల్ రెడ్డి,కౌన్సిలర్ లు,నాయకులు,పట్టణ వాసులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇవ్వనోళ్ళు నిరుద్యోగుల గురించి మాట్లాడడం విడ్డురం

### మార్కెట్ కమిటీ చైర్మన్..



**నంగునూర్, అక్షిత ప్రతినిధి:** ఉద్యోగాలు ఇయ్యానోళ్లు నిరుద్యోగుల గురించి మాట్లాడం విడ్డురంగా ఉందని నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి విమర్శించారు.

ఆదివారం నంగునూర్ లో విలేకరుల తో మాట్లాడాతు కేటీర్ అనే ఓ తోడేలు ఇవాళ మేక తోలు కప్పుకొని మాట్లాడుతే నమ్మేవాళ్ళు లేరని తెలియజేశారు.గత ప్రభుత్వం లో నోటిఫికేషన్లు ఇచ్చి ప్రశ్న పత్రాలను జిరాక్స్ సెంటర్లలో పల్లీ బఠాణీల మాదిరిగా అమ్ముకుని వందలాది కోట్ల రూపాయలు సంపాదించుకున్నారూ ఆ పరీక్షలు పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలనే ఆలోచన నీ కుటుంబానికి వచ్చిందా అని ప్రశ్నించారు. మీ యెలుబడిలో తెలంగాణా నిరుద్యోగుల, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా ఆలోచించారా? వారిని అసలు మనుషుల్లా చూశారా? మానవీయ కోణంలో చూశారా?" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆనాడు కవితను, వినోద్‌ను ప్రజలు తిరస్కరిస్తే వెంటనే ఉద్యోగాలు ఇచ్చారని, తెలంగాణ బిడ్డల గురించి ఒక్కనాడైనా ఆలోచించారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చిందని గుర్తు చెశారు.ప్రజాపాలన ప్రభుత్వం నిరుద్యోగుల తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ నియామక పత్రాలిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డంకులన్నీ తొలగించి గ్రూప్-1 నిర్వహించామని పేర్కొన్నారు. ఇప్పుడు కెసిఆర్ కుటుంబన్ని నమ్మే పరిస్థితులు తెలంగాణా లో లేవన్నారు.

## ఇస్రో తొలి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంలో భాగమైన

# శ్రీ చైతన్య విద్యార్థి వినయ్

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శ్రీహరికోటలో నిన్న విజయవం తంగా నిర్వహించిన భారతదేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగం లో శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రీసెర్చ్ ఖమ్మం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పూర్వ విద్యార్థి వినయ్ కుమార్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వర్తించడం కళాశాలకు గర్వకారణమని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అత్యున్నత అంతరిక్ష పరిశోధనా కార్యక్రమంలో తమ కళాశాల పూర్వ విద్యార్థి భాగస్వామి కావడం ప్రతి అధ్యాపకుడికి విద్యార్థికి యాజమాన్యానికి గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని వినయ్ కుమార్ మరోసారి నిరూపించారని అన్నారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీ విద్య మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు పొందే నాణ్యమైన సాంకేతిక విద్య ఆధునిక ప్రయోగశాలలలో అందించే ప్రాక్టికల్ శిక్షణ పరిశోధనా దృక్పథం క్రమశిక్షణ నైతిక విలువలు అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా



తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విద్యా వాతావరణాన్ని కళాశాల ఎల్లప్పుడూ కల్పిస్తోందని చెప్పారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థి దశలో తరగతి గది బోధనతో పాటు ల్యాబ్‌లలో పొందిన ప్రాక్టికల్ అనుభవం మినీ మరియు మెజర్ ప్రాజెక్టులు సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొనడం పరిశ్రమలతో అనుసంధానం అధ్యాపకుల నిరంతర ప్రోత్సాహం వినయ్ కుమార్ విజయానికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. కళాశాలలో అలవర్చుకున్న క్రమశిక్షణ సమయపాలన సమస్యలను విశ్లేషించే నైపుణ్యం జట్టు భావన వంటి లక్షణాలే నేడు ఇస్రో వంటి అత్యున్నత సంస్థలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడానికి దోహదపడ్డాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు కేవలం డిగ్రీలను అందించడమే కాకుండా దేశ నిర్మాణంలో భాగస్వాములు అయ్యే నైపుణ్యం కలిగిన ఇంజినీర్లను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత ఆవిష్కరణ నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ భవిష్యత్ సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వినయ్ కుమార్ సాధించిన ఈ ఘనత కళాశాల విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని ఈ విజయం మరెందరో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తుందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరెన్నో జాతీయ అంతర్జాతీయ విజయాలను సాధించే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ చార్యులు కుమార్ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు శ్రీ వినయ్ కుమార్‌ను హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదేశానికి తెలంగాణ రాష్ట్రానికి శ్రీ చైతన్య విద్యాసంస్థలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆగస్టు 10న కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై

# జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

### సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య




**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక,కర్షక,కూలీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు.

రామన్నపేట మండలం లోని స్థానిక సిపిఎం కార్యాలయంలో సీఐటీయూ,రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను




బలహీనపరుస్తూ, నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో,వ్యవసాయానికి అవసరమైన మద్దతు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు,గ్యాస్,పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదని వీబీజీరామ్ గా పేరు మార్చి నిర్వీర్యం చేస్తుందని,కూలి రేట్లు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం,నిరుద్యోగాన్ని పెంచే విధానాలు అమలు చేయడం, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను నిర్లక్ష్యం చేయడం ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగస్టు 10న జరిగే జైలు భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువజనులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, సహాయ కార్యదర్శి నకిరకంటి రాము, జిల్లా కమిటి సభ్యులు బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయభాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మేడి ముకుంద,గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల బిక్షం,గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్లపల్లి బాలరాజు,ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ జిల్లా నాయకులు అప్పం సురేందర్, పల్లె సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వంగాల మారయ్య, నాయకులు ఆవనగంటి నగేష్,నాగటి లక్ష్మణ్,చెన్ను స్వామి,ఉండ్రాతి నర్సింహా,ఆవనగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల సాధనకు కృషి చేస్తాం

**ఎంపి మల్లు రవి**

**బీడు భూముల సాగునీటి సమస్య పరిష్కారానికి సమిష్టి కృషి అవసరం - అంతర్రాష్ట్ర సమన్వయం కీలకం**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాజెక్టుల సాధనకు తనవంతు కృషి చేస్తానని నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి పేర్కొన్నారు . మహబూబ్ నగర్ నగరంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బీడు భూముల సాగునీటి సమస్యలు, పెండింగ్ ప్రాజెక్టులపై విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపి తో కలిసి , ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లియెన్నం శ్రీనివాస్ రెడ్డిలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ రైతుల యొక్క ప్రయోజనాలే తమకు ముఖ్యం అని ఆయన చెప్పారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో రైతులను మోసం చేసిందని, ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే పూర్తి చేసినట్లుగా హంగామా చేసిందన్నారు. ఈ పరిస్థితి చూస్తే మళ్ళీ నాటి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమమే గుర్తుకు వస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తే బీడు భూములను సస్యశ్యామలం చేయవచ్చని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు కలిసి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు (మహబూబ్ నగర్) జిల్లా వలసల జిల్లాగా, వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, కానీ ప్రస్తుతం అన్ని విధాలా అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్, ఆర్థిక వ్యవస్థ కూడా బలంగా ఉండడమే కాదు అప్పట్లో కొత్త రాష్ట్రం కాబట్టి బ్యాంకులు కూడా విరివిరిగా సహాయం చేశాయని, కాని ఇప్పుడు పరిస్థితి అలా లేదని డబ్బు రీపేమెంట్ చేస్తే కానీ నిధులు బ్యాంకులు ఇవ్వలేవని , అయినా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు కోసం బడ్జెట్ లో 5,6 వేల కోట్లు కేటాయించవచ్చు కాని వాటితో ప్రాజెక్టు పూర్తి కాదని కనీసం 30 వేల కోట్లు కావాలని ఆయన చెప్పారు. నిజాలను నిర్భయంగా చెప్పాలని , నిజాయితీగా మాట్లాడాలని, అలా మాట్లాడితే సమస్య పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు. ఇలాంటి రౌండ్ టేబుల్ సమావేశాల్లో రైతులను కూడా భాగం చేయాలని, సమస్యలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సరైన పరిష్కార మార్గాలను చూపుతాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మహబూబ్ నగర్ వెనుకబాటు పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల లోపాలే ప్రధాన కారణమని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత కూడా మన మహబూబ్ నగర్ నీటి బాధల ద్వారానే వచ్చిందన్న విషయాన్ని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మహబూబ్ నగర్ మట్టి బిడ్డ రేవంత్ రెడ్డి ఉండడంతో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు.

గత ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని విమర్శించారు. ఉద్దండాపూర్ వద్ద పనుల పరిస్థితి ఆశించిన విధంగా లేదని అక్కడ బొందల గడ్డను తలపిస్తుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఇలాంటి రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని జేఏసీ నాయకులకు సూచించారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతుల్లో అన్ని వేదికలపై పెండింగ్ ప్రాజెక్టులపై చర్చలు జరిపి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఆరోపణలకంటే రైతుల భవిష్యత్తు ముఖ్యమని, పార్టీలకు అతీతంగా నిజాయితీతో పనిచేస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అలాగే అంతర్రాష్ట్ర సమన్వయం ప్రాధాన్యతను వివరించిన ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు ఎలా జీవనాడిగా మారిందో, అలాగే తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు రైతులకు ప్రాణాధారంగా మారాలని తెలిపారు. కృష్ణా నది నీటి వినియోగంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కలిసి చర్చలు జరిపితేనే స్థిర పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందని, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాజెక్టులు పూర్తి అయితే లక్షల ఎకరాలకు నీరు అందడంతో రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. ఇటీవల తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై గేట్లను ప్రారంభించడమే కాకుండా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఆర్‌డీఎస్ (=ఖా) అంశంపై చర్చించి సహకారం కోరిన విషయాన్ని వెల్లడించారు. రాజకీయ ఆరోపణలకంటే కార్యాచరణపై దృష్టి పెట్టి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని, పాలమూరు అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల సహకారంతో అన్ని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి నాయకులు సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఫరూఖ్ హుస్సేన్, జెఏసి నాయకులు బెక్కం జనార్ధన్, వీరబ్రహ్మాచారి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు జగపతి రావు, కార్పొరేటర్లు ఎంపి ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు

# 'ఎస్ఐఆర్' పేరుతో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో ప్రజలంతా సహకరించాలి**

**ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలి**

**పెద్ద అంబర్పేట్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( ఎస్ఐఆర్) ప్రక్రియకు ప్రజలంతా సహకరించాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయి ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలన్నారు. బీఎల్వోలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పులు, నిర్లక్ష్యం లేదా ఒత్తిడికి తావివ్వకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా నమోదు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు తమ పేరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటర్లు బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాది అని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, ఓటరు జాబితా కచ్చితత్వం కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని సక్రమంగా పూరింపజేసి తిరిగి స్వీకరించాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు ప్రజలకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. బీఎల్ఓలు చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఫారాలను సకాలంలో పూర్తిచేసి అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలూ లేదా బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని వారు ఓటర్లకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు సర్ ప్రక్రియలో విధిగా పాల్గొనాలని వారు సూచించారు.

# ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్**



**తొర్రూరు, అక్షిత బ్యూరో:** తొర్రూరు పట్టణ 10వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో, న్యూ లైఫ్ లైన్ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యమే సమాజానికి నిజమైన సంపద అని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. సమయానుకూలంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న న్యూ లైఫ్ లైన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. శిబిరంలో డా. సురేష్ (ఎండీ, జనరల్ ఫిజీషియన్) మరియు షుగర్ వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో అన్ని రకాల సాధారణ ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే ఉచిత బీపీ, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ పిలుపునిచ్చారు.

# బి ఆర్ ఆర్ ఫౌండేషన్ బూడిద రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**రంగారెడ్డిఅక్షితబ్యూరో:** తుర్కయంజాల్ లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్ లో, అబ్దుల్లాపూర్ మెట్టు లో ని వైఎన్ఆర్ గార్డెన్స్ లో సాయి కీర్తన్ రెడ్డి లెగసి ట్రస్ట్,ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఆరోగ్యమే ఆస్తి ఆరోగ్యమే ఆనందం అనే శీర్షికతో జులై 17వ తేదీన సొంత గ్రామమైన ఉప్పరిగూడ గ్రామంలో అలాగే 18 వ తేదీన ఇబ్రహీంపట్నం భారత్ గార్డెన్స్ లో మరియు యాచారం గ్రామపంచాయతీ వద్ద నిర్వహించి ఈరోజు 19 ఆదివారం ఈ శిబిరం యంజాల్, అబ్దుల్లాపూర్మెట్ మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. సాధారణ వైద్య పరీక్షలు న్యూరాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్య సేవలు, ఉచిత కంటి పరీక్షలు స్త్రీల ఆరోగ్య సంబంధిత వైద్య సేవలు, పిల్లల వైద్య సేవలు రక్తదాన శిబిరం జర్నల్ సర్జన్ ఈ సేవలు బిఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా సాధు రామ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి బృందం, హాస్పిటల్ డాక్టర్ వినయ్ రెడ్డి వైద్య బృందం నిర్వహించడం జరిగింది, సంగం బ్లడ్ బ్యాంక్ రక్తదానంలో చేసిన వారిలో 54 మంది ఉన్నారు.యాంజాల్లో సాధారణ ఓపీలు 520 అబ్దుల్లాపూర్మెట్ లో 240 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది.అలాగే ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత బూడిద రామ్ రెడ్డి, ఉప్పరిగూడ గ్రామ సర్పంచ్ వేణినందకుమార్,బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు బూడిద నర్సింహారెడ్డి, మనీష్ రెడ్డి ,మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్య గౌడ్, గుండ్ల రాజిరెడ్డి. మడుపు గోపాల్,అమరేందర్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, ధనంజయ రెడ్డి, నాగేష్ గౌడ్, ఉదయ్ ,మంగ ఐలేష్ , పున్నమి రాము, ఎంపల్ల మోహన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, జర్మన్ రెడ్డి , బత్తుల వెంకటేష్ , గౌరిగి రమేష్ బొడుసు వెంకటేష్ యాదవ్, సామల శ్రీనివాస్ రెడ్డి ,బోసు పల్లి కరుణాకర్, హరికృష్ణ, ఆర్మీ మోహన్, వట్టిపల్లి రామ్ రెడ్డి, సద్దాం బాబ్రాజ్ ,నరుకుడి నందు, పోచయ్య, శేఖర్ యాదవ్, మడుపు వివేక్, విక్రమ్, యాదవ్,,శ్రావణ్ శ్రీనివాస్ , వివిధ కాలనీలకు సంబంధించిన అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యూ బృందాన్ కాలని నూతన కార్యవర్గం

## గౌరవ అధ్యక్షులుగా జెర్కోని రాజు, అధ్యక్షులుగా వరికుప్పల యాదగిరి ఎన్నిక



**రంగారెడ్డి అక్షితబ్యూరో:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని న్యూ బృందావన్ కాలనీ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఆదివారం ఎనుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా వరికుప్పల యాదగిరి,గౌరవ అధ్యక్షుడి గా జెర్కోని రాజు ఉపాధ్యక్షులుగా తాంద్ర రమెష్, ప్రదాన కార్యదర్శ కాసొజు దయాచారి, కోశాధికారి గా మైలారం విజయ్ రజాక్,లి కార్యదర్శులుగా పండాల రాఘవేందర్ గౌడ్, కొంపల్లి నగేష్, రవికాంత్, ప్రచారి కార్యదర్శి గా వరికుప్పల అశోక్. సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాలనీలోని ముఖ్య నాయకులు, కాలని వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కాళేశ్వరం మాదిరిగా కృష్ణా నదిపై బ్యారేజీలు నిర్మించాలి

## కృష్ణా ట్రిబ్యునల్ పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ కు నీటి వాటాగా 60 టీఎంసీ ల కేటాయింపు చేయాలి

## శ్రీశైలం 67 గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలి

## వెల్లటూరు -గుంది మళ్ళ బ్యారేజ్ నాయకులు పెరుమాళ్ళ శ్రీనివాస్



**చిన్నంబావి, అక్షిత న్యూస్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణ నది సుమారు 200 కిలోమీటర్ల ప్రవహిస్తూ ఉన్న నిర్వసితులుగా మారిన కొల్లాపూర్,అలంపూర్, గద్వాల వనపర్తి జిల్లాలో సాగు,తాగునీటి సమస్య పరిష్కారానికి కృష్ణా నదిపై బ్యారేజ్ కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణం చేయాలని,అలాగే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు నీటి కేటాయింపు చేయాలనీ ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో క్రౌన్ గార్డ్ ఫంక్షన్ హాల్ లో సాగు నీటి సమస్య పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కొల్లాపూర్ నియోజక వర్గం జేఏసీ తరుపున పాల్గొన పెరుమాళ్ళ శ్రీనివాస్ అన్నారు.జూరాల, బీమా చివరి ఆయకట్టు అయిన ఉమ్మడి వీపనగండ్ల మండలంలో సుమారు 45 వేల ఎకరాల కు నీళ్ళు అందించడానికి కృష్ణ నదిపై మరో లిఫ్టు కానీ,లేదా బ్యారేజ్ నిర్మాణం చిన్నంబావి మండలంలో ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టి కి తీసుకెళ్లారు.ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లు రవి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వివిధ పార్టీల జిల్లా అధ్యక్షులు,పలు నియోజకవర్గాల జేఏసీ ఇన్చార్జీలు,రాఘవాచారి, ప్రకాష్ గౌడ్, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు,అడ్వకేటు బెక్కం జనార్ధన్, వేణుగోపాల్ చారి ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి జేఏసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం లో కొల్లాపూర్ తరుపున తెలంగాణ ఉద్యమకారులు దేశగౌని రామన్ గౌడ్,పెరుమాళ్ళ తిరుపతి, పెరుమాళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా సాగని “సర్”

## తీవ్ర వత్తిడిలో అధికారులు, సిబ్బంది

## గుదిబండగా మారిన 2002 నిబంధన

## “సర్” నిర్వహణలో లోపాలెన్నో..





**తొర్రూరు, జూలై 19, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న “సర్” నిర్వహణ ప్రక్రియలో ఎన్నో లోపాలు ఉన్నాయని 2002 నిబంధన గుదిబండగా మారినందువల్ల అధికార యంత్రాంగం, సిబ్బంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనుకావడం వలన వారు సరిగ్గా పని చేయలేకపోతున్నారని తద్వారా “సర్” సజావుగా సాగడం లేదని సామాజికవేత్త దొనికెన కుమారస్వామి విమర్శించారు. తొర్రూరు మున్సిపాలిటీ ఆఫీసులో గత వారం రోజులుగా నడుస్తున్న “సర్” క్యాంపులో 2వవార్డులో, మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను నింపుతూ, సందేహాలను నివృత్తి చేస్తూ ఓటర్లకు సహకరిస్తున్న దొనికెన “సర్”



నిర్వహణలోని పలు లోపాలను గుర్తించి స్థానిక ఎమ్మార్వోకు లెటర్ రూపంలో అందజేశారు. అనంతరం ఆదివారం నాడు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విలేఖరులతో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.బూత్ ల వారిగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కాకుండా గత మునిసిపల్ ఎన్నికల ఓటరు లిస్టు ఆధారంగా వార్డుల వారిగా బీఎల్వోల చేత పంపిణీ చేయిస్తే బీఎల్ఏ ల సహకారంతో దాదాపుగా వార్డులోని ఓటర్లందరికీ సకాలంలో ఫారాలు అందేవని దొనికెన అభిప్రాయపడ్డారు.

2002 నిబంధనపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించకపోవడం వలన ఫారాలు నింపడం, సబ్మిట్ చేయడంలో ఆలస్యం అవుతున్నదని దొనికెన అన్నారు.

ఫారంలోని ఒకటవ, రెండవ భాగంలో ఉన్న కాలమ్స్ నింపడంపై సిబ్బంది కొంత విచక్షణతో వ్యవహరించకపోవడం వల్లనైతేనేమి, ఓటును కాపాడుకోవడం కోసం లోకల్ లో లేని ఓటర్లు వ్యయ ప్రయాసలు పడి ఓటు ఉన్న ఊరికి వస్తే సానుకూలంగా స్పందించి వారికి సరియైన సమాచారాన్ని ఇచ్చేవారు లేకపోవడం వల్లనైతేనేమి ఓటర్లు చాలా చాలా ఇబ్బందులు పడుతున్నారని దొనికెన అన్నారు.ఉదాహరణకు తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని 271వ బూత్ లో దాదాపు పట్టణంలోని అన్ని వార్డుల ఫారాలే కాకుండా ఇతర మండలంలోని గ్రామాల ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలు కూడా కలిపి ఉండడం వలన విధులను సక్రమంగా నిర్వహించాలని అనుకునే బీఎల్వోలకు, అధికార యంత్రాంగానికి సైతం ఇబ్బందికరమైన సమస్యగా మారిందని దొనికెన కుమారస్వామి అన్నారు.ఇలాంటి సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ అర్హులైన, అసలైన, వాస్తవమైన, సక్రమమైన ఓటర్ల ఓటు పోకుండా ఎలక్షన్ కమీషన్, అధికార యంత్రాంగం గడువులోగా చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని లేనిచో గడువు పెంచినా ప్రయోజనం ఉండదని దొనికెన విజ్ఞప్తి చేశారు.

## అంగరంగ వైభవంగా

# శాలివాహన బోనాలు

## ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సునీత లక్ష్మారెడ్డి



**సంగారెడ్డి అక్షిత బ్యూరో :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శాలివాహన బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం బోనాల ఊరేగింపులో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. సంగారెడ్డి ఐబీ నుంచి కొనసాగిన బోనాల ఊరేగింపు అస్తబల్‌లోని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా శాలివాహన బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, సునీత లక్ష్మారెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, శ్రీధర్ రెడ్డి, రామప్ప, జలేందర్, అంజద్, వాజిద్‌తో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవంతంగా

# స్నేహపూర్వక 5 కి.మీ పరుగు పందెం



**పర్వతగిరి అక్షిత ప్రతినిధి:** పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్–-వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో “స్వామి వివేకానంద రన్ -- కల్లెడ” (రన్ ఫర్ నేషన్ -- విలేజ్ ఎడిషన్) పేరుతో 5 కి.మీ. స్నేహపూర్వక పరుగు పందెం కళాశాల ప్రాంగణం నుండి మండల కేంద్రంలోని విస్డం పాఠశాల వరకు కొనసాగిందని కళాశాల ప్రిన్సిపల్ ఆడేపు జనార్ధన్ అన్నారు. ఈ స్నేహపూర్వక పరుగుపందెంలో వివిధ గ్రామాలలోని దాదాపు 430 మంది యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోటీని పూర్తి చేశారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డిఎఫ్ సంస్థల వ్యవస్థాపకులు ఎర్రబెల్లి రామ్మోహన్ రావు, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, సబ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రావు మాట్లాడుతూ... ప్రతి నెల ఇదేవిధంగా స్నేహపూర్వక పరుగు పందెం నిర్వహిస్తూ,వివేకానంద జయంతిని పురస్కరించుకొని దాదాపు ఐదు వేల మందితో 5 కి.మీ. పరుగు పందెం నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు శారీరిక దృఢత్వాన్ని కలిగి ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎస్సై ప్రవీణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి చదువు మరియు శారీరకంగా బలంగా ఉండడం ముఖ్యమని, వ్యక్తి శారీరకంగా దృఢంగా ఉంటే మానసికంగా ఉన్నత వ్యక్తులుగా మారడానికి అవకాశం ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ చదువుతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఒక పక్షికి రెండు రెక్కలు ఉంటే ఏ విధంగా అయితే దూసుకెళు_ందో అదే విధంగా ప్రతి వ్యక్తి చదువుతో పాటు, శారీరకంగా బలంగా ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. తదనంతరం పోటీలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్,షీల్డ్స్ మరియు స్వామి వివేకానంద సాహిత్యం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డిఎఫ్ కళాశాల ప్రిన్సిపల్ ఆడేపు జనార్ధన్,విస్డం పాఠశాల ప్రిన్సిపాల్ అనుమాండ్ల దేవేందర్, ఆర్డిఎఫ్ విద్యాసంస్థల సిబ్బంది, పలు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.